
ప్రజాశక్తి
శనివారం 12 జులై 2025 5 విజయనగరం



సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. శుక్రవారం పోలీసువెల్ఫేర్‌డేలో భాగంగా సిబ్బంది సమస్యలను ఆయన విన్నారు. వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.



మహిళా కానిస్టేబుల్ సమస్యలను తెలుసుకుంటున్న ఎస్‌పి

ఎండుతున్న వరినారు... రైతు కంట కన్నీరు

- ఆయిల్ ఇంజిన్లతో 'తడిచి' మోపెడు భారం
- చెంతనే ప్రాజెక్టు ఉన్నా అందని నీరు

మొన్నటివరకు పదిరోజులు పాటు ముసురు పెట్టడంతో రైతులంతా ఎంత ఆనందంతో పొలాల్లో వరి విత్తనాలు వేశారు. అంతలోనే భగ భగ మండే ఎండలతో మొలకెత్తిన వరినారు మల మల మాడిపోతోంది. కళ్లెదుటే వరినారు ఎండిపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. చేసేది లేక వేల రూపాయల పెట్టుబడితో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకొని వరినారును బతికించుకుంటున్నారు.



ఎండిపోతున్న వరినారు

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలో గత కొద్దిరోజులుగా చినుకులు మొఖం చాటేయడంతో వరినారు పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 5వేల ఎకరాలకు సరిపడా వరినారు వేశారు. మరికొంతమంది రైతులు యద చల్లారు. అయితే కొద్దిరోజులుగా వర్షం కురవకపోడంతో వరినారు ఎండిపోతోంది. సంతకవిటి, శ్రీహరినాయుడు పేట, కొండగూడెం, కృష్ణవలస ఎం.ఆర్ అగ్రహారం, ఎస్. అగ్రహారం, గొల్లవలస తదితర గ్రామాల్లో నీటి ఎద్దడి కారణంగా వరినారు ఎండిపోతోంది. మడ్డువలస ప్రాజెక్టు నుంచి రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే కోంద్రు మురళీమోహన్ నీరు విడుదల చేసినప్పటికీ మండలంలోని గ్రామాలకు మాత్రం నీరు రావడం లేదు. కాలువలు సరిగా లేకపోవడమే ఇందుకు కారణమని రైతులు మండిపడుతున్నారు.

ఈనేపథ్యంలో శ్రీహరినాయుడుపేట, కృష్ణవలస, కొండగూడెం, ఎం.ఆర్ అగ్రహారం, గొల్లవలస తదితర గ్రామాల రైతులు పొలాల సమీపంలో ఉన్న చెరువులు, బావుల నుంచి మోటారు ద్వారా నీరు తోడుతూ వరినారును తడుపుకుంటున్నారు. అయితే ఇంజిన్‌కు గంటకు ఐదు వందల రూపాయలు అద్దె చెల్లించాల్సి రావడంతో ఆవేదన చెందుతున్నారు. వేలాది రూపాయలు అప్పు చేసి పంటలు వేసినా నీరు లేక నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు.

ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా ... ఎండుతున్న పోలాలు

మడ్డువలస ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా, కాలువల ద్వారా పొలాలకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. నారాయణపురం అనకట్టులో కూడా నీరు ఉన్నప్పటికి అనకట్టు షటర్ల పనులు ఇంకా జరుగుతుండడంతో నారాయణపురం అనకట్ట కుడి, ఎడమ ప్రధాన కాలువ నుండి నీరు విడిచి పెట్టడం లేదు. మండలంలోని గెడ్డలు, సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు తూతూ మంత్రంగా చేపట్టడం వల్లే నీరు రావడం లేదని రైతులు అంటున్నారు.



ఇంజన్ తోనీరు అందిస్తున్న రైతు

సాగునీరు విడుదల చెయ్యండి

వర్షాలు పడక, సాగునీరు అందక వరి నాట్లు ఎండిపోతున్నాయి. అధికారులు సాగునీరు విడుదల చెయ్యకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. నీటి కోసం ఇంజన్ పెట్టడంతో గంటకు రూ.500 చెల్లించుకోవాల్సి వస్తోంది. మడ్డువలస నుంచి సాగునీరు అందించాలి.

వండాన సూర్యారావు
రైతు, శ్రీహరినాయుడుపేట

పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలి

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డివి రమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పిఆర్‌సి కమిటీని నియమించి ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యా సాగర్, డివి రమణ కోరారు. ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన తర్వాత మొదటి సారి జిల్లాకు వచ్చిన వారు స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత వారికి వై-జంక్షన్ వద్ద ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశం లో వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఉద్యోగులు సమస్యలు గురించి ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు. గత ప్రభుత్వంలో రివర్సు పిఆర్‌సి ఇచ్చారని, హెచ్ఆర్, పిఎఫ్, జిపిఎస్ పెండింగ్ బిల్లులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపు తున్నారని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.27,500 కోట్లు గత ప్రభుత్వంలో బకాయి ఉండి పోయిందన్నారు. కొత్త ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రూ. 7,500 కోట్లు విడుదల చేసిందన్నారు. సమయం ఇవ్వాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం కోరడంతో ఇప్పటివరకూ సమయం ఇచ్చా మన్నారు. ఉద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం పట్టించు కోవడంలేదని, పిఆర్‌సి కమిటీ వేయకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, సరెండర్ లీవుల బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను సన్మానించారు. ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీధర్‌బాబు, ఎ.సురేష్, సహాధ్యక్షులు జివిఆర్‌ఎస్ కిషోర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌జిఒ సంఘం నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్, రమణను గజమాలతో సత్కరిస్తున్న ఎపి ఎన్‌జిఒలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్, రమణ



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ నాగార్జున

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- విజయనగరం కోట, కంటోన్మెంట్

జిల్లాలో సహకార సంఘాల బలోపేతం చేసే విధంగా కృషి చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కిమిడి నాగార్జున కోరారు. స్థానిక డిసిసిబి ప్రధాన కార్యాలయంలో నాగార్జున అధ్యక్షతన శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్, సంఘాల వద్ద ఆర్థిక పరమైన అవకతవకలకు తావు లేకుండా భద్రత ప్రమాణాలను మరింత పటిష్టం చెయ్యాలన్నారు. బ్రాంచులు ద్వారా ఖాతాదారులకు అందించే సేవలను మరింత మెరుగుపరిచే విధంగా సదరు సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించాలిని చెప్పారు. బ్యాంక్ అంతర్గత తనిఖీ, నియంత్రణ విధానాలను మరింత కఠిన తరం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న కాలంలో బ్యాంక్ తీసుకునే అభివృద్ధి చర్యలు, సేవలు విస్తరణ, గ్రామీణ వ్యవసాయ రంగానికి మరింత మద్దతు చేకూరెలా మరింత దృష్టి సారిస్తామన్నారు. అనంతరం డిసిసిబి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో డిసిఒ పిల్లి రమేష్, సిఇఒ ఉమామహేశ్వర రావు, నాబార్డ్ డిడిఎం టి.నాగార్జున, ఎపిసిఒబి డిజిఎం షేక్ అప్సర్ జహాన్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే నిరవధిక సమ్మె
ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు అమలు, చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రకటించిన హామీలు వెంటనే అమలు చేయాలని ఎపి ఆశావర్కర్స్‌యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. లేదంటే జులై అనంతరం నిరవధిక సమ్మె చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తత స్థాయి సమావేశం ఎం. గౌరి అధ్యక్షతన జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రస్తుతం ఇస్తున్న గౌరవవేతనం పెరిగిన ధరల ప్రకారం ఎందుకూ చాలదన్నారు. ఆరేళ్ల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. కనీస వేతనాలు చెల్లిస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినా అమలు చేయలేదన్నారు. మరో వైపు పనిభారం బాగా పెరిగిందన్నారు. సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారని, దీనిపై అడిగితే అదనపు పనులు అప్పగించకూడదని సర్క్యులర్ ఇచ్చిన ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదన్నారు. ఎఎన్ఎం చేయాల్సిన పనులు కూడా ఆశావర్కర్లతో చేయిస్తున్నారన్నారు. సెలవులు అమలు కావడం లేదన్నారు. సెలవులు, వారాంతపు సెలవులు, గ్రాట్యుటీ, వయో పరిమితి పెంచుతామని, మెటర్నిటీ సెలవులు ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. మార్చి 1 నుంచి రిటైర్డు అయిన వారిని కొనసాగించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేల లేఖలు ఆధారంగా నియామకాలు చేపట్టడం సరైనది కాదన్నారు. చనిపోయిన ఆశా వర్కర్లు పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఎన్ఎంగా శిక్షణ పొందిన ఆశావర్కర్లకు ఎఎన్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను ఈనెలాఖరు లోగా పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సిఐ టియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్, జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



కలెక్టర్ అంబేద్కర్‌ను కలిసిన కేంద్ర బృందం సభ్యులు

ప్రభుత్వ పథకాల పరిశీలనకు కేంద్ర బృందం రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు జిల్లాకు నేషనల్ లెవెల్ మోనిటర్స్ కమిటీ విచ్చేసింది. ఈ బృందం జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌ను శుక్రవారం తమ ఛాంబర్‌లో కలిసి వారి 10 రోజుల పర్యటన, కార్యక్రమాల వివరాలను వివరించారు. సునీల్ బంట, నాతు సింగ్ ఆధ్వర్యం లోని బృందం జిల్లాలో బాడంగి, బొబ్బిలి, విజయనగరం మండలాల్లో పర్యటించి పలు శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న శిక్షణలను లబ్దిదారులతో మాట్లాడి పరిశీలిస్తారని తెలిపారు. రోజుకు ఒక గ్రామం తరపున పర్యటించి పథకాలపై ఆరా తీస్తారని అన్నారు. సంబంధిత ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు ఈ బృందానికి సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం లో జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ సావిత్రి, డ్వామా పీడీ శారదా దేవి, సర్వే ఎడి రమణ మూర్తి, హౌసింగ్ పీడీ మురళీ , పంచాయతీరాజ్ ఎస్ఇ రమణ మూర్తి, ప్లానింగ్ ఎడి మహాలక్ష్మి, మూడు మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.



క్రీడా పోటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతి

20న పారా అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు రాజీవ్ క్రీడా మైదానంలో జరుగనున్నాయని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు తెలిపారు. శుక్రవారం ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా క్రీడాధికారి ఎల్. వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.దయానంద్‌తో కలిసి క్యాంపు కార్యాలయంలో ఆమె విడుదల చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టులో 14వ జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగనున్నాయని, ఈ పోటీలకు అర్హత సాధించేందుకు ముందుగా జిల్లా స్థాయిలో ఎంపిక కావాల్సి ఉందని అన్నారు. 13 ఏళ్ళ నుండి 18 ఏళ్ళ లోపు వికలాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని అన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారు ఆగష్టు 9న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావలిన్‌త్రో పోటీలు నిర్వహిస్తారన్నారు. పేర్లు నమోదు చేసుకునేందుకు 9849377577 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సారధి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ప్రదీప్, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు వైసిపి మండల స్థాయి సమావేశం

వేపాడ : వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం వేపాడలో నిర్వహిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

మొక్కలు పెంపకంపై అవగాహన

మెంటాడ : మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని ఉయ్యాడవలసలో బ్రెడ్స్ సంస్థ టిడిఎఫ్ నాబార్డ్ ప్రాజెక్టు 100 మంది రైతులకు శుక్రవారం మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ చిన్నప్పయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ సర్పంచ్ భీమారావు, బ్రెడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జిందాల్ రైతులకు చట్టప్రకారమే పరిహారం : కలెక్టర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిందాల్ భూములకు సంబంధించి మిగిలిన రైతులకు పరిహారాన్ని వారం రోజుల్లో అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిందాల్‌కు కేటాయించిన భూములకు సంబంధించి తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఇప్పటివరకు చెల్లించిన పరిహారం, పెండింగ్ బకాయిలపై ఆరా తీశారు. సుమారు 28 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం పెండింగ్ ఉండగా, వీరిలో ముగ్గురికి ఇటీవలే చెల్లించినట్లు అధికారులు వివరించారు. మిగిలినవారిలో 11 మందికి కూడా వారంలో పరిహారాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూములు తీసుకున్న సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం మాత్రమే వారికి వర్తిస్తుందని స్పష్టం చేశారు. పరిహారం తీసుకోవడంలో వారే జాప్యం చేశారని, అందువల్ల చట్టప్రకారం పరిహారం పెరిగే అవకాశం లేదని తెలిపారు. 53 బోరుబావులకు సంబంధించి, ఇప్పటికే 28మందికి నష్ట పరిహారం ఇచ్చామని, మిగిలిన వారికి కూడా వెంటనే అందజేయాలని జిందాల్ ప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల స్థలాలు కోల్పోయిన 16 మంది గురించి చర్చించారు. నిబంధనల ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల తరువాత మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈలోగా సమస్య పూర్తిగా పరిష్కారం కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్‌సేతు మాధవన్, ఆర్‌డిఒ డి.కీర్తి, ఎస్.కోట తాహశీల్దార్ డి.శ్రీనివాసరావు, డి సెక్షన్ సూపరింటెండెంట్ తాడ్డి గోవింద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య విధానంలో ప్రత్యేక సాంకేతిక ప్రణాళిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రత్యేక సాంకేతిక ప్రణాళిక ద్వారా పారిశుధ్య విధానాన్ని అవలంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం తమ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నూతనంగా జారీచేసిన సాంకేతిక పరమైన అంశాలను ఆయన ప్రస్తావించారు. ప్రతి ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ లోపాలు లేకుండా తప్పనిసరిగా జరగాలని సిబ్బందికి ఆదేశించారు. ఆరుబయట చెత్త వేయకుండా గృహస్థలాలకు వాణిజ్య సముదాయాలలో అవగాహన కల్పించాలన్నారు. కేటాయించిన గృహాల వద్దకు నిర్దీత సమయానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని బూత్ లెవెల్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న కార్యశాల నుద్దేశించి ఆయన మాట్లాడారు. నియమించిన బూత్ స్థాయి అధికారులు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ కనీసం 1500మంది ఓటర్లను చేర్చుకునే విధంగా కషి చేయాలన్నారు. ఓటరు జాబితా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి మరణించిన వారి పేర్లను తొలగించడంతోపాటు ఫార్మ్ 6 ద్వారా కొత్త ఓటర్లను చేర్చుకోవడం, ఫార్మ్ 8 ద్వారా ఓటరు మారిన అసెంబ్లీ స్థానం వివరాలను నమోదు చేసుకోవడం వంటి ప్రక్రియలను చేపట్టాలన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. జీవన రాణి పోస్టర్‌ను ఆవిష్కరించాఉ. అనంతరం నర్సింగ్ శిక్షణ విద్యార్థులతో కలసి అధికారులు, సిబ్బంది చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ వివాహం, బిడ్డల మధ్య ఎడం పెంచే తాత్కాలిక పద్దతులు, శాశ్వత పద్దతులపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలని తెలిపారు. ప్రణాళిక బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం ఉండాలన్నారు. ప్రజల్లో కుటుంబ నియంత్రణ పద్దతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ అంశాలకు సంబంధించి విస్తతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 11నుంచి కుటుంబ నియంత్రణ పద్దతులు పాటించే వారికి తగు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కె.రాణి, జిల్లా టీకానివారణ అధికారి ఆర్. అచ్చుత కుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ఎన్. సూర్యనారాయణ, డిఎస్ఒ సంధ్యారాణి, డెమో వి.చిన్నతల్లి, డిప్యూటీ డెమో రవి కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం. చాముండేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

200 కేజీల గంజాయి పట్టివేత?

కంటోన్మెంట్ : దత్తి రాజేరు మండలం మానాపురం రైల్వే గేట్ సమీపంలో గురువారం అర్ధరాత్రి గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను మానాపురం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు రైల్వే గేట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు కారులో ఉన్న సుమారు 200 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.గంజాయితో పాటు రెండు కార్లను పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గంట్యాడ

స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని గురువారం రాత్రి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మమేకమై కొన్ని విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని మంచి భవిష్యత్తును సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పదో తరగతిలో మొదట ర్యాంకును సాధించి ఉన్నత చదువులకు ఎదగాలన్నారు. ఈ తనిఖీల్లో వసతి గృహ సంక్షేమాధికారి గొర్ల గోవింద సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

రైతులకు అవసరమైన ఎరువులను ఎంఆర్‌పి ధరలకంటే అధిక ధరలకు అమ్మితే అటువంటి షాపులపైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎన్ఎస్ సూర్యకుమారి సంబంధిత వర్తకులను హెచ్చరించారు. శనివారం పట్టణ పరిధిలోని రెండు ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాలను సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి ఎటువంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని వ్యాపారులకు సూచించారు. రైతులకు అమ్మకం చేసే ఎరువులకు సంబంధించి బిల్లులను తక్షణమే చెల్లించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంఆర్‌పి ధరల ప్రకారమే ఎరువులను అమ్మాలని, అధిక ధరలకు ఎరువులను అమ్మ చూపుతున్నట్లు ఫిర్యాదులు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ వాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని చింతలవలసలో జరుగుతున్న పారిశుధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి డి.వి.మల్లికార్జునరావు, జిల్లా కోఆర్డినేటర్ బిఎస్‌కె పట్నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్, మంచినీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. కాలువలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలన్నారు. క్లోరినేషన్ చేసి ప్రతి రోజూ పిఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని గొడ్డుపాలెం గ్రామంలో వ్యవసాయాధికారి టి. సంగీత వరి విత్తనాల శుద్ధిపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. డ్రమ్ము సీడర్‌తో వరి విత్తనాలు వేసే పద్ధతులను వివరించారు. ముందు రోజు మడి కట్టి నానబెట్టిన 30 కేజీల వరి విత్తనాలకు 250 గ్రాముల సుడోమోనస్ కలిపి వేసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - డెంకాడ

నియోజకవర్గంలో పేదలకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులు రూ.4.28లక్షలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం ముంజేరు పార్టీ కార్యాలయంలో అందించారు. పూసపాటిరేగ మండలానికి చెందిన నడిపేన పుష్పకు రూ.1.42లక్షలు, కందివలసకు చెందిన కర్రి గురుమూర్తికి రూ.1.15లక్షలు, నెల్లిమర్ల మండలానికి చెందిన బుగత రాజేంద్రప్రసాద్‌కు రూ.52,646, తాలాడ శ్రీనుకు రూ.39,883, అక్కింత పద్మావతికి రూ.42,305, డెంకాడ మండలానికి చెందిన బాలిక దాసు అస్విత్‌కు రూ.35,681 సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రాయుడుపేట రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 50-1లో ఎకరా ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకొని చదును చేస్తున్నారని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్ రాములమ్మ స్పందించి శుక్రవారం ఆ భూమిలో హెచ్చరిక బోర్డు పెట్టించారు. ఈ భూమిని ఎవరు ఆక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

గ్రోత్ సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

గ్రోత్ సెంటర్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. విశాఖ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన పియుసి సమీక్ష సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. విశాఖ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు రోడ్డు విస్తరణ చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని, గ్రోత్ సెంటర్లో నూతన పరిశ్రమలు ఏర్పాటుకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

సింగరాయి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు శుక్రవారం సింగరాయి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలు, ప్రార్థన, విద్యార్థులతో తెలుగు అక్షరాలు, పదాలు, చదివించడం, ఇంగ్లీషు చదివించడం, కిచెన్ గార్డెన్ మొదలగునవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు

నేరాలు ఘోరాలు

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

గొలుసు దొంగలు తమ పంథాను మార్చారు. ఇంత వరకూ రోడ్లపై నడిచివెళుతున్న మహిళలను టార్గెట్ చేస్తు దొంగతనాలకు పాల్పడేవారు. అయితే తాజాగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న మహిళ మెడలో గొలుసును శుక్రవారం అపహరించిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని గుంకలాం గ్రామానికి చెందిన పాండ్రంకి సత్యవతి శుక్రవారం ఉదయం తమ పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుంది. ఈ సమయంలో ఒక దొంగ రోడ్డుపై బైక్ ఆపి మహిళ వద్దకు వచ్చి ఆకస్మాత్తుగా మహిళపై దాడి చేసి మెడలో ఉన్న మూడు తులాల బంగారం ఆభరణాలను దొంగిలించాడు. మహిళలు కేకలు వేసినా ఎవరూ సమీపంలో లేకపోవడంతో దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె. అశోక్ కుమార్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్

పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో వివాహిత బి. మణి(24) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లిమర్ల మండలం టొంపల పేటకు చెందిన మణికి పూసపాటిరేగ మండలం ఎరుకొండ గ్రామానికి చెందిన సురేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా వీరిద్దరి మధ్య వివాదం ఉంది. రెండు వారాలు క్రితం రాజీవ్ నగర్ కాలనీలో నివాసముంటున్న మృతురాలి పెద్దమ్మ తన ఇంటికి మణిని తీసుకొచ్చింది. గతంలో మణికి పరిచయమున్న ఎరుకొండ గ్రామానికి చెందిన బి.సాయికుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని వారిద్దరూ విజయవాడకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు తిరిగి మృతురాలిని తన పెద్దమ్మకు అప్పగించారు. బంధువులు తనను మందలించడంతో మనస్థాపానికి గురైన మణి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి టొంపల సూర్యం తన కుమార్తె మృతికి సాయికుమార్ కారణమని పోలీసులుకు ఫిర్యాదు చేసింది.

ప్రియుడు వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్, డెంకాడ

ప్రియుడు వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన భోగాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఎస్ఐ సూర్యకుమారి తెలిపిన వివరాలు మేరకు. మండలంలోని నారుపేట గ్రామానికి చెందిన అట్టాడ పుష్ప(22), చోడవరం మండలం మాడుగల గ్రామానికి చెందిన సాయి గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత కొద్ది రోజులగా ప్రియుడు సాయి వేధింపులు తాళలేక గురువారం రాత్రి ఇంట్లో ప్యానుకు చీరతో ఉరి వేసుకొని పుష్ప అత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు తగరపువలస ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆమె మృతి చెందింది. మృతురాలి తల్లి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. తండ్రి కనకరాజు ఉన్నారు. మృతురాలు ఓ ప్రైవేటు పరిశ్రమలో ఫిల్లింగ్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ శాఖ పనితీరుపై మండిపాటు

ప్రజాశక్తి - రేగిడి

ఖరీఫ్ వ్యవసాయం పట్ల వ్యవసాయ శాఖ పనితీరు బాగోలేదని, అసలు వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారా.. లేరా.. అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు సభ్యులు ఇన్చార్జి వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్. విజయలక్ష్మిపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఎఇఒ విజయలక్ష్మి ఖరీఫ్ వ్యవసాయంపై మాట్లాడుతుండగా బూరాడ సర్పంచ్ వావిలిపల్లి శశిభూషణరావు అడ్డు తగిలి పంచాయతీకి ఎరువులు వచ్చినా ప్రోటోకాల్ పాటించకుండా సర్పంచ్, ఎంపిటిసిలకు తెలియకుండా టిడిపి నాయకులకు ఇవ్వడంపై అభ్యంతర వ్యక్తం చేశారు. బూరాడ సచివాలయంలో పనిచేసిన వ్యవసాయ అసిస్టెంట్ ప్రియాంక రాజకీయం చేస్తూ రైతులకు ఎరువులు ఇవ్వడం లేదన్నారు. మీ భూమిలో వందమందికి సంబంధించి వన్ బి తీసిన పత్రాలను ఓ నాయకుడు ఇవ్వడంతో వారికే ఎరువులు ఇచ్చినట్లు మండిపడ్డారు. దీనిపై ఎఇఒ స్పందించి మాట్లాడుతూ ఈ విషయం తమకు తెలియదని అన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చొరవ తీసుకొని మాట్లాడుతూ ఎన్ని రైతు సేవా కేంద్రాలున్నాయి, ఎంతమంది వ్యవసాయ అసిస్టెంట్లు ఉన్నారో చెప్పమన్నారు. 21 రైతు సేవా కేంద్రాలున్నాయని, వాటిలో 11 సచివాలయాలకు సిబ్బంది బదిలీపై వెళ్ళారని తెలిపారు. విద్యుత్ శాఖ చర్చలో భాగంగా ఎఇ సురేష్ మాట్లాడుతుండగా చిన్న శిర్లాం సర్పంచ్ టంకాల ఉమా పాపినాయుడు అడ్డుతగిలి తమ సచివాలయ లైన్మెన్ బాలరాజు విధులకు గైర్హాజరవుతున్నారని, గత సమావేశాల్లో కూడా చర్చించినా ఫలితం లేదని అన్నారు. అప్పాపురం సర్పంచ్ కరణం నిర్మల మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రైవేటు వ్యక్తులు చేత వీధిలైట్లు సొంత నిధులతో వేస్తున్నామని, లైన్ మ్యాన్‌తో వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్ మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా గ్రామాల్లో మంచినీటి పథకాలు, పారిశుధ్య పనులు జరిగేలా సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు చొరవ తీసుకొని జిల్లా అధికారులతో మాట్లాడి నిధులు వచ్చేలా చూడాలని ఎంపిడిఒ శ్యామలా కుమారికి సూచించారు. విద్యాశాఖపై ఎంఇఒ వరప్రసాదరావు మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ కలుగజేసుకొని తల్లికి వందనం ఎంతమంది విద్యార్థులకు వచ్చింది. ఇంకా ఎంతమంది విద్యార్థులకు రాలేదని ప్రశ్నించారు. దీనిపై ఎంఇఒ మాట్లాడుతూ ఇంకా 810 మంది విద్యార్థులకు వివిధ కారణాల వల్ల రాలేదని బదులిచ్చారు. ఆర్అండ్‌బి చర్చిలో సతీష్ కుమార్ మాట్లాడుతూ పాలకొండ రాజాం ప్రధాన రహదారి ఉంగరాడ మెట్ట, మజ్జి రాముడుపేట గ్రామాల సీసీ రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం రోడ్డు గుంతలమయం కావడంతో తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేపడతామని సభలో చెప్పారు. వైద్యం, రెవెన్యూ, ఉపాధి హామీ, హౌసింగ్, ఐసిడిఎస్, తోటపల్లి, మడ్డువలస, పశువైద్యం, పంచాయతీరాజ్, మత్స్య శాఖలపై నామ మాత్రం చర్చలు జరిగాయి. అధికారులు వచ్చినా.. సభ్యులు గైర్హాజరవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారిని నిలదీస్తున్న బూరాడ సర్పంచ్

బిఎల్‌ఒలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

బిఎల్‌ఒలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్‌డిఒ రాంమోహన్ రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్‌ఒలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల బూత్ స్థాయి అధికారులు శిక్షణా తరగతులను ఈ నెల 9 నుంచి ప్రారంభించామన్నారు. బొబ్బిలి మండలంలో ఉన్న బూతు స్థాయి అధికారులందరికీ రెండు రోజులు శిక్షణ తరగతులు పూర్తి చేశామన్నారు. శుక్రవారం పోలింగ్ కేంద్రం నెంబరు 101 నుంచి 151 వరకు ఉన్న బొబ్బిలి, రామభద్రపురం మండలాల బూత్ స్థాయి అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్ల దగ్గర నుండి ఫారం 6 క్లైములను సేకరించాలన్నారు. చనిపోయిన, శాశ్వత బదిలీలు ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిపోయిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించడానికి ఫారం 7 ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. జాబితాలో ఉన్న వివరాల్లో తప్పులు ఉంటే సవరణలు చేయడానికి ఫారం 8 ద్వారా సవరణ చేయాలన్నారు. అనంతరం బిఎల్‌ఒలకు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి తహశీల్దార్ యం.శ్రీను, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపిడిఒ రవికుమార్, నియోజకవర్గ ఎన్నికల ఉప తహశీల్దార్, బలివాడ గౌరీశంకర్రావు ఇతర ఎన్నికల సిబ్బంది, బొబ్బిలి, రామభద్రపురం మండలాల బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : పక్కా ఓటర్ల జాబితా తయారీకి బూత్ లెవెల్ అధికారులు అంకిత భావంతో పనిచేయాలని నియోజకవర్గ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి, తహశీల్దారు అధికారి కె.శ్రీకాంత్ అన్నారు. ఐదు రోజుల పాటు జరుగునున్న బిఎల్ఒ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన స్థానిక సికెఎమ్ కాలేజీ సమావేశ మందిరంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ వివిఆర్ జగన్నాథరావు అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పక్కా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను అన్నింటినీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పిఎస్ పరిధిలో గల రాజకీయ ప్రతినిధులు సలహాలతో తగు నివేదికను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, కంప్యూటర్ ఆపరేటర్‌లు మహేష్, భాస్కరరావు, సూరి పాల్గొన్నారు.



బిఎల్‌ఒకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఆర్‌డిఒ

పోలిపల్లిలో 'కార్యకర్తే అధినేత'

ప్రజాశక్తి - డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని పోలిపల్లిలో ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇంఛార్జీ కర్రోతు బంగార్రాజు తన ఇంటివద్ద శుక్రవారం కార్యకర్తే అధినేత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులలో భూ సమస్యలు, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలు, సిసి రోడ్లు, కాలువలు, విద్యుత్తు సమస్యలు ఎక్కువగా వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు సూచనలు మేరకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలుంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బుడా మార్గదర్శకాలకు లోబడి ముద్రించామని, ఎవరికైనా అభ్యంతరాలుంటే తెలపాలని ఆమె కోరారు. మున్సిపాలిటీలో ఆస్తులున్న వారు అభ్యంతరాలుంటే ఆగస్టు 4లోగా తెలపాలన్నారు.

ట్యాంకు ఏర్పాటుకు శంకుస్థాపన

శృంగవరపుకోట: మండలంలోని లచ్చందొరపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రక్షిత మంచినీటి ట్యాంకు ఏర్పాటుకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామానికి రక్షిత మంచినీటి ఏర్పాటు రూపకల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ ట్యాంకు నిర్మాణం మూడు నెలల్లో పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వర రావు, వైస్ ఎంపిపి సుధారాజు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, సన్యాసిదేవుడు, మురళి రాజు, శ్రీనురాజు, సుంకర బుల్లిబాబు, ఆడారి సూరప్పారావు, ఆడారి పాపారావు, మామిడి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వేపాడ

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాక పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బానాది గ్రామంలో టిడిపి సర్పంచ్, ఎంపిటిసి అభ్యర్థులకు ఏకపక్షంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. శుక్రవారం మండలంలోని బానాదిలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు గురించి వివరించారు. పోతంపేట - బానాది గ్రామాల మధ్య గల రెడ్డిపాలెం గెడ్డ కల్వర్ట్ నిర్మించాలని ఎమ్మెల్యేని ప్రజలు కోరారు. బానాది ఎస్‌సి కాలనీలో విద్యుత్తు సమస్యని ఎమ్మెల్యే దృష్టిలో పెట్టగా తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, మహిళ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎంపిటిసి గొంప తులసీ, బల్లంకి మాజీ సర్పంచ్ నాగరాజు, వైస్ సర్పంచ్ పిల్లి ధనుంజయ్, గుంటుపల్లి దేముడునాయుడు, రంధి మహేష్, కోన సత్యం, నిరుజోగి బంగారునాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

విజయనగరం కోట: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో 5, 6, 7వ డివిజన్లలో, మండలంలోని పడాలపేట, నారాయణపురం గ్రామాలలో పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. అనంతరం పట్టణంలో నవాబుపేట డాక్టర్ పివిజి రాజు విగ్రహం జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

టోల్ గేట్ కాటా వద్ద వివాదం

అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని లారీ డ్రైవర్లు నిలదీత - దౌర్జన్యానికి దిగిన సిబ్బంది

ప్రజాశక్తి - డెంకాడ

నాతవలస జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి పెద్ద ఎత్తున వివాదం జరిగింది. టోల్‌గేట్ లారీ కాటా వద్ద అక్రమంగా లారీల నుంచి అధిక లోడు పేరిట డబ్బులు వసూలు చేయడంతో వివాదం తలెత్తింది. కాటా పనిచేయకపోయినా అంచనాగ అధిక లోడు చూపించి డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని లారీ డ్రైవర్లు సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో సిబ్బంది ఒక్కసారిగా ఎదురు తిరిగి లారీ డ్రైవర్లపై దౌర్జన్యం చేయబోయారు. ఫలితంగా అటు లారీ డ్రైవర్లు సైతం ప్రతిఘటించడంతో వివాదం పెరిగింది. తరువాత లారీ డ్రైవర్లు తమ యూనియన్‌కు సమాచారం ఇవ్వడంతో యూనియన్ సభ్యులు, లారీ ఓనర్లు గురువారం రాత్రి టోల్‌గేట్ వద్దకు వచ్చి కాటా సక్రమంగా పనిచేస్తుందా లేదా అని వీడియో, ఫోటోలు తీసే ప్రయత్నం చేశారు. దీంతో కాటా సిబ్బంది యూనియన్ సభ్యులపైకి కర్రలతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీనికి నిరసనగా శుక్రవారం ఉదయం టోల్‌గేటు వద్ద ధర్నా చేసేందుకు యూనియన్ ప్రతినిధులు నవతా ట్రాన్స్‌పోర్టు రాష్ట్ర అధ్యక్షులు ఎంజెఆర్ఎస్ మహరథి, సెక్రటరీ బి.శేషగిరి, ట్రెజరర్ వివి రాజు పిలుపునిచ్చారు. దీంతో పెద్ద ఎత్తున లారీ డ్రైవర్లు, యూనియన్ నాయకులు, లారీ యజమానులు టోల్‌గేటు వద్దకు చేరుకున్నారు. దీంతో మరోసారి కాటా సిబ్బందికి, యూనియన్ ప్రతినిధుల మధ్య వివాదం చెలరేగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఇరువర్గాలతో మాట్లాడి స్టేషన్‌కు పిలిపించి వివాదం లేకుండా సిఐ జి. రామకృష్ణ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. దీంతో కాటాలోని కంప్యూటర్ బిల్లు వచ్చినంత వరకూ లారీల వద్ద నుంచి అధిక బరువుకు సంబంధించి ఎటువంటి ఫీజులు వసూలు చేయమని సిబ్బంది పోలీసుల సమక్షంలో అంగీకరించారు. దీనికి ముందు తూనికలు కొలతలు శాఖాధికారులు కూడా టోల్‌గేట్ వద్దకు చేరుకుని కాటాను పరిశీలించి, కంప్యూటర్‌తో కూడిన సామగ్రిని సీజ్ చేశారు.



అధికారులకు సమస్యను వివరిస్తున్న యూనియన్ నాయకులు

జనాభా సమతుల్యతతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - బొబ్బిలి

జనాభా సమతుల్యతతోనే అభివృద్ధి సాధ్యమని రోటరీ జిల్లా చైర్ జెసి రాజు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో రోటరీ కార్యదర్శి శివ కాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెసి రాజు మాట్లాడుతూ జనాభా అవసరమే కానీ పరిధికి మించిన జనాబావుంటే అభివృద్ధి జరగటం కష్టమవుతుందన్నారు. ఎన్నో విషయాల్లో ముఖ్యంగా ఉపాధి, ఆరోగ్య, విద్యా సంబంధిత అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ప్రకృతి వనరులు కూడా అందరికి సరిపోవని జనాభా పెరిగితే వచ్చే సమస్యలపై ప్రతివారికీ అవగాహన ఉండాలని చెప్పారు. జనాభా పెరుగుదల నేరాల రేటు పెరగడానికి కారణమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ పూర్వ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్ అధ్యాపకులు రాములప్పుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది, స్కూల్ విద్యార్థినిలతో కలిసి ర్యాలీ నిర్వహించామని ఇఒ నరసింహారావు తెలిపారు. తల్లి కావడానికి సరియైన వయస్సు, శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. చిన్న కుటుంబం చింత లేని కుటుంబం, అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం, దేశాభివృద్ధికి కుటుంబ నియంత్రణ పాటిద్దాం, బిడ్డకి బిడ్డకి ఎడం పాటిద్దాం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సింహాద్రినాయుడు, పి.హెచ్.ఎన్ జగదాంబ, హెచ్‌వి. పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఫార్మసీ ఆఫీసర్ ఆశ జ్యోతి, లాబ్ టెక్నీషియన్ సంతోష్, ఏ.ఎన్ఎమ్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రాయింగ్, పెయింటింగ్‌లో ఎం.గౌతమి దేవాడ జడ్‌పి స్కూల్ ప్రథమ స్థానం, ఎపిఎంఎస్ భోగాపురం పి. కార్తీక ద్వితీయ స్థానం, ఎస్.గీత జడ్‌పి స్కూల్ దత్తిరాజేరు తృతీయ స్థానం, వ్యాసరచనలో వి.చరిస్మా చీపురుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రథమ స్థానం, జి.వర్షిత ఎపి మోడల్ స్కూల్ భోగాపురం ద్వితీయ స్థానం, ఎం.కోమలి జడ్‌పి స్కూల్ కొండపాలెం గరివిడి మండలం తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిందాల్ బాధితుల పక్షాన నిలవాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రజా ప్రతినిధులు జిందాల్ బాధితుల పక్షాన నిలవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. జిందాల్ బాధితులకు విశాఖ పార్లమెంటు సభ్యులు భరత్, ఎమ్మెల్యే లలిత కుమారి, అప్పుడు భూములు ఇప్పించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వెంటనే కలుగజేసుకొని బాధితులను ఆదుకోవాలని కోరారు. శుక్రవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో బొడ్డవర హైవే పక్కన నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ నిర్వాసితుల తరపున ఉన్న చట్టాలు అమలు చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు జిందాల్ తరపున మాట్లాడుతుండడం వల్ల గిరిజన దళిత పేద రైతులకు న్యాయం జరగదన్నారు. భూమి కోసం నిర్వాసితుల కోసం ఉన్న చట్టాలు పరిశ్రమ దగ్గరికి వచ్చేసరికి అమలు చేయడం లేదన్నారు. చట్టం ప్రకారం జిందాల్ కోసం సేకరించిన భూములను తిరిగి బాధిత రైతులకు అప్పగించాలన్నారు. భూమి తీసుకున్నప్పుడు జిందాల్‌తో చేసుకున్న ఏ ఒప్పందమూ అమలు చేయడం లేదన్నారు. కంపెనీలో ఉద్యోగం ఉంటుందని, కంపెనీలో వాటా ఉంటుందని అప్పుడు భూమి ఇస్తే ఇప్పుడు అదే కంపెనీ ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్‌కు సిద్ధపడి కోట్లలో వ్యాపారం చేయదలిస్తే దానిలో నిర్వాసితుడికి ఎటువంటి వాటాగాని, హక్కు లేకుండా భూమి నుంచి గెంటేయడం సరికాదన్నారు, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేసేందుకు అనుమతులు ఇవ్వడం లేదని అయినా నిర్వాసితులకు భూమి అప్పగించే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు..

కోళ్లఫారాన్ని పరిశీలించిన అధికారుల బృందం

మెంటాడ: మండలంలోని జయతి పంచాయతీ బిరసాడవలస వద్ద విజయనగర్ హేచరీస్ పేరుతో నడుస్తున్న కోళ్లఫారాన్ని శుక్రవారం అధికారుల బృందం పరిశీలించింది. ఈ కోళ్లఫారం వల్ల వాయు, జల కాలుష్యం వ్యాప్తి చెందుతోందని బిరసాడవలస గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు, ఆందోళన చేసిన నేపథ్యంలో నిజ నిర్ధారణకు ఐదు శాఖలకు చెందిన అధికారులతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్, పశుసంవర్ధక, భూగర్భజల, రెవెన్యూ, ఆరోగ్యశాఖ పోలీసు శాఖ అధికారులు బృందంగా కోళ్లఫారం వద్దకు వెళ్ళి అన్ని కోణాల్లో పరిశీలించారు. కోళ్లఫారం సిబ్బంది, కూలీలతో అధికారులు మాట్లాడారు. వారి వద్ద వివరాలు తీసుకుని నమోదు చేసుకున్నారు. కోళ్లఫారం పరిసరాలను కూడా అధికారులు నిశితంగా పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోళ్లఫారాన్ని పరిశీలించామని, నివేదికను వారికి అందజేస్తామని విజయనగరం పశుసంవర్ధక శాఖ జెడి వైవి రమణ స్పష్టం చేశారు. ఈ బృందంలో డిపిఒ మల్లిఖార్జునరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇఇ శార్వాణి, వైద్య ఆరోగ్య శాఖ డిఎస్ఒ డాక్టర్ సత్యనారాయణ, తహశీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ సీతారాం ఉన్నారు.

అగ్రిఫీల్డ్స్ ఆధ్వర్యాన ఉచిత ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అధునాతన వ్యవసాయ పరిష్కారాల సంస్థ (అగ్రిఫీల్డ్స్) ఆధ్వర్యాన పూసపాటిరేగ మండలం, రెల్లివలసలో శుక్రవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం, స్థానిక పాఠశాలలో క్రీడోత్సవం నిర్వహించారు. తొలుత ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సలహాలను ప్రచారం చారు. ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎక్కువ మందికి, ముఖ్యంగా మహిళల్లో బిపి, సుగర్ ఉన్నట్టు గుర్తించారు. క్రీడోత్సవంలో భాగంగా 6-10 తరగతుల నుండి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖో-ఖో వంటి జట్టు ఆటలలో పోటీ పడ్డారు. విజేతలు మరియు రన్నరప్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రిఫీల్డ్ నిర్వాహకులు గుప్తా, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ, మల్యాడ, ఒమ్మి, తమ్మాపురం, తంగుడుబిల్లి గ్రామాల్లో శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అని చెప్పి మోసం చేశారని భవిష్యత్‌లో కూడా మోసం గ్యారంటీ అని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, వైసిపి నాయకులు రేగాన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, మత్స సత్యనారాయణ, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గిరిబాబు, చనమల్ల తులసి, మద్దిల వాసు, అంబల్ల కిరణ్, సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు